# శిశు వాత్సల్యము

శ్రీమతి కామరాజు మైత్రేయిగారు

ఆమె యొక సైనికుని భార్య. భర్త రణరంగమునందు మృతుడైనాడు. శవమును తెచ్చి యింటిలో పరుండబెట్టినారు. ఇరుగుపొరుగు స్త్రీలు ఆమెను ఓదార్చుటకు వచ్చిరి.

ఒక యువతి మెల్లగ సైనికుని (భర్త) యొక్క మంచి గుణములను, వాని సుస్వభావములను మిక్కిలిగ పొగడి చెప్పినది.

భార్య చలించలేదు. శిలాప్రతిమవలె కూరుచున్నది. కంట ఒక్క అశ్రువునైన రాల్చలేదు.

మఱియొకర్తుక లేచి శవము దగ్గఱకు వెళ్లి దాని ముఖముమీద కప్పబడిన గుడ్డను కొంచెము తొలగించినది. అప్పుడైనను, ఆ సతీతిలకము చలించలేదు. నిశ్చేష్టురాలై కూరుచున్నది.

దగ్గఱవుండిన స్త్రీలందరు ఆమె అవస్థనుచూచి చాల భయము చెందినారు. ఎవరికిని ఆమె జీవించునను ఆశ తోచలేదు.

ఇంతలో నొక ముదుసలిదాసి లేచి వెళ్లినది. మరుక్షణమున ఆదాసీది చక్కని చుక్కయగు నొక వత్సరపు శిశువును తెచ్చి, 'భార్య' ఒడిలో కూర్చుండబెట్టినది.

దుఃఖసముద్రమున తుపాను చెలరేగినట్లు ఆయెను. ఆమె పెద్దపెట్టున రోదనముచేసెను. అశ్రువులు సంతతధారగ ప్రవహింప మొదలిడెను.

'బిడ్డా! నీకోసమై నేను జీవించియుండెద'నను పలుకులు ఆమె నోటి నుండి అప్రయత్నముగ వెలువడినవి.

ఆహా! శిశువాత్సల్యము.